# శిక్ష

ఏవేవో భ్రమాతరంగాలు స్పృహ మగతల కొసలను పట్టుకు వేళ్లాడుతూ..

గాంధీ మొహమ్మీద ఓ బొద్దింక!

క్రైమ్ లిస్టుల నల్లబల్లమీదో బల్లి... గాంధీ మొహం బొద్దింకన్కర్చుకునేందుకు మొహమ్మీద బొద్దింక వాలినా బోసి నవ్వు నవ్వుతున్నాడు గాంధీ.

రేపుల్లేవు... నిల్.. కొట్టివేత గీత... మా పోలీసుల్చేసే రేపులు నేరాలు కావు!

చెయిన్ స్నాచ్‌లు.. మూడొందలలోటి...!

హెచ్‌బీలు.. నూటెనభై తొమ్మిది...!

హింసల్లిస్టు చదివేలోపల గాంధీ మొహ్హమ్మీంచెగిరి రైటర్ టేబిల్మీది, పోలీస్ టోపీ మీద వాలింది బొద్దింక. గాంధీ 'హాఁ' అనే లోపల పోలీస్ టోపీని భరించలేక బొద్దింక మళ్ళీ గాంధీ బొమ్మమీదే వాలింది.

బొద్దింక.. గాంధీ.. పోలీస్ టోపీ...!

జుగుప్స.. .అహింసా.. జుగుప్స..

ప్రాణాలున్న శిలాజం.. ప్రాణం పోయిన రాజకీయ పవిత్రత.. ప్రాణాలు తీసే పాడు కంపూ!

నాలుక మందంగా ఉంది. కళ్లు అంటుకుపోయినయ్.

మాసిన తెల్లచొక్కా.. ఖాకీ పాంటు,

సస్పెండెడ్ ఎస్సైఫౌండడర్ల ఇన్‌ఫ్లుయన్స్ ఆఫ్ ఆల్కహాల్ ఆన్ డ్యూటీ... డీసీపీ సికిందర్గాడు చేసిన లాకప్ మర్డర్కి తాను బలి!

అండర్ల ఇన్‌ఫ్లూయన్సాఫ్ ఆల్కహాల్.. ఓహోహో...! అప్పుడేమో తెలీదు.. ఇప్పుడొంటినిండా నరనరానా అదే!

చిన్నగా లేచి, వణుకుతూ వణుకుతూ వెళ్ళి పాయిఖానాల ముందున్న నల్లా దగ్గర మొహం కడుక్కుంటుంటే....

లంజెకొడుక్కు యెప్పుడ్సస్డో గానీ మన సీసీయస్కి దామాద్దెండు గద బై...గా డీసీపీ గాని కూనీ కోసరానికి మన్తోని గీ తాగబోతోన్ని సాకిస్తున్నరు!' గట్టిగా అంటూ విసుక్కుంటున్నాడు రైటర్.

"ఊకో సార్! అయ్నకి మనం బెట్టుడేముంది గనక...పెద్దసార్లకి బొయ్యేదాన్ల గీయన కిస్తున్నం!" లెవెన్‌జీరో టూ వెంకటేశ్వర్లంటున్నాడు.

మొహం కడుకుని లోపలికొచ్చా.

'యేం సారూ! ఇంగ షురూ జేసుడేనా?" అని వికవికా నవ్వాడు రైటరు. "నీ కతే బాగుంది పో! దూపగైతే గుడుంబా, బుక్కవడ్తే టేషన్ల బువ్వ!" అని మళ్లీ బొజ్జ లొడలొడా ఊగేలా వికవికా నవ్వాడు.

వాడి అపహాస్యాన్ని వినా అసహ్యాన్ని పట్టించుకునే దశ పోయింది.

సీసీయస్ బైటికొచ్చా.

సెంట్రల్ క్రైమ్‌స్టేషన్... నిజమే... నేరాలన్నింటికి కేంద్రం ఇదే గదా!

పిల్ల కానిస్టేబుల్ ఇబ్రహీం మోపెడ్ స్టార్ట్ చేస్తున్నాడు.

"బాబూ! లక్ష్మీ విలాస్ లాడ్జి దగ్గర డ్రాప్చేసి పో!" అని వాడి అంగీకారం లేకముందే వెనకాల కూచున్నా.

వాడు విసుక్కున్నాడో, తిట్టుకున్నాడో, అసహ్యించుకున్నాడో నా కనవసరం! నా అవసరమంతా వేరే.... వేరే......వేరే!.

మోపెడ్ కదలబోతుంటే "ఓయ్ సెవెన్లెవెన్!" గట్టిగా అరిచినట్లు పిలిచి చప్పట్లు కొట్టి బొర్రాపుతూ మెట్లు దిగుతూ రైటరు.

ఏడొంధల పదకొండు ఇబ్రహీం మోపెడ్ ఆఫ్ చేశాడు.

రొప్పుతూ దగ్గర కొచ్చాడు రైటర్. నా చేతిలో ఓ నల్ల రూపాయి నాణెం పెట్టాడు "గా నాయక్ లంజొడుకు మాల్దెస్తే ఫోన్గొట్టు... గన్నె తాగొద్దు! గీడికొచ్చినంక పోస్తంలే! సమ్జయిందా?" అన్నాడు.

నను గూర్చిన సంబోధనల్లో 'మీరు, సర్' మాయమై రెండున్నరేండ్లయింది..ఓయ్, నువ్వు సమక్షంలో, 'గా లంజొడుకు... తాగుబోతోడు' పరోక్షంలో!

అర్థమైందన్నట్టు తలూపాను.

సస్పెండెడ్ ఎస్సై ఫౌండదర్ద ఇన్ఫ్లుయెన్సాఫ్ ఆల్కహాల్... తాగుబోతు లంజొడుకు..సీసీయస్ దామాద్.... ఇప్పుడు పోలీసిన్ఫార్మర్ కూడా నన్నుమాట.

అన్నిభావాలకూ ఒక్కటే రియాక్షన్ నా మొహమ్మీద.. కాండ్రించి ఊసిన ఉమ్మి పడ్డా...స్టేషన్ గోడకు తాపడమైన గాంధీ మొహమ్మీదలా బొద్దింక వాలినా.... నంబరాఫ్ క్రైమ్‌ల లిస్టు బ్లాక్ బోర్డు మీదలా నా మీద బల్లి పాకినా... లాకప్‌లో ఇంటరాగేషన్లో ఉన్న దరిద్రుడికి మల్లే నీళ్లడిగితే ఖాకీ ఫాంట్లోపన్చేసి మా రక్షకభటులు ఉచ్చలు పోసినా.. సకార వికరాల్లేని ముఖం నాదైపోయింది.

సికిందర్‌గాడు చేసిన బడిపంతులు ఖూనీతోటే నేనూఖూనీఅయిపోయా. ఇప్పుడు

నాదో శవం ముఖం, రైగర్ షూర్టీస్‌తో నీలుక్కుపోయింది. వాడు డీసీపీ కాబట్టి అప్పుడు డ్యూటీలో ఉన్న ఎస్సైను నేనుకాబట్టి.. కమ్యూనిస్టు సింపతైజర్ అన్నపేరుంది కాబట్టి... బడిపంతులు ఖూనీకోరునేనే అయిపోయా. సస్పెక్ట్ బీటెస్టు డెత్‌బై ఎస్సై అన్ డ్యూటీ హూ వాజ్‌ఫౌండ్ అండర్ద ఇన్‌ఫ్లుయెన్సాఫ్ ఆల్కహాల్.. అంతే! తాగుడంటే ఏమోతెలీన్నేను ఇప్పుడొచ్చి అస్సల్ సిస్సల్ తాగుబోతుని... లంజొడుకు...సీసీయస్ దామాద్‌గాడిని... ఆల్వేస్ అండర్ద ఇన్‌ఫ్లుయెన్సాఫ్ ఆల్కహాల్... వెనకా ముందూ ఎవ్వరూ లేని నాకు సీసీయస్సే ఇల్లైంది. వాడు చేసిన నేరానికి పరిహారమేనన్నట్లు డిసీపీ నన్నిక్కడే ఉండనిస్తున్నాడు. ఇప్పుడునాకు స్టేషనే ఇల్లు.

✦ ✦ ✦

దేశంలో సారాయి నిషేధం... ఛీప్ లిక్కర్ పేరుతో సీసాల్లో సర్కారు వారే రంగు సారాయన్నమ్మడం చట్టబద్ధం! ఖద్దర్లూ, ఖాకీలూ కలివిడిగా పాల పాకెట్లమ్మినట్టు సారా పాకెట్లమ్మడం కళ్లకు బ్లైండ్లు కట్టిన చెక్కగుర్రం గవర్నమెంటుకు కనబడదు.

నాయక్‌లాంటి కొండజాతి వాళ్లకు తెల్సింఛ, చేయగల్గిందీ ఆ అడవిలో దొరికే పువ్వూ, కాయా, కొమ్మా, చిగురూ, రెమ్మజిగురూ కలిపి సారా వండడమే, సీకాయా, కుంకుళ్లూ.. ఆకులూ మూలికల్తోపాటు కాచిన సారా అమ్మడం మాత్రమేవాడికి తెల్సు. సారా అమ్మడం నేరమంటే వింతగా చూసేవాడు. నాగరికత వాణ్ణీ... వాళ్ళలాంటి వాళ్లనూ కూడా తాకేసి వాళ్లనీ కల్మషం చేసేసిందెప్పుడో! వాడి సారాకు మంచి రేటన్న సంగతి పోలీసులే వాడికి చెప్పారు. "నువ్వింత... కమ్ము!" మాకింత ఇవ్వు!' "నీ కింత మిగులు" అన్న లెక్కలు నేర్పారు. రెణ్ణెలకోసారి నిన్ను పట్టుకుంటాం... కేసు వేస్తాం.... మాకూ ఆఫీసులో నేరాల లెక్కలు వండాల్సిన ఆగత్యముందని వాడికి చెప్పేశారు.

షరా మామూలుగా, ఈరోజు నాయక్ సారా తెచ్చేరోజు. నే వెళ్ళి వాడు తెచ్చిం తర్వాత రైటర్గాడిచ్చిన రుపాయతో సీసీయస్‌కి ఫోన్చేస్తా... వాళ్లొచ్చి రైడ్ చేస్తారు.. వ్యవస్థీకృత నేరం!

నాయక్ నవ్వుకుంటూ సారా కాన్తో వానెక్కుతాడు.. వాన్లోనే మామూళ్లనబడే రొక్కం ఇచ్చేస్తాడు. దర్జాగా రైటర్ దగ్గరో, ఇంటో హెడ్డు దగ్గరో సిగరెట్టిప్పించు క్కాలుస్తాడు. పెద్ద చౌక్ దగ్గర వాణ్ణి మర్యాదగా దింపేస్తారు. మళ్లీ ఏ మూణ్ణెళ్లకో తంతు రిపీటవుతుంది. కాన్లో సారా పోలీసుల్లో తాగేవాళ్లందర్కీ వెళ్తుంది. డబ్బు మాత్రం హోదాను బట్టి బట్వాడా అవుతుంది.

✦ ✦ ✦

లక్ష్మీవిలాస్ పక్క సందులోంచి నడుస్తున్న పందులూ, కుక్కలూ దిబ్బమీద ఎంగిలాకుల కోసం భీకరంగా యుద్ధం చేస్తున్నాయి. ఆ వీధిలో రెండు వీధి లైట్లున్నా అవెప్పుడూ వెలగవు. మునిసిపాలిటీ వాళ్లు వేసీ వేయగానే ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళను పిల్చుకొచ్చి అంబేద్కర్ నగర్ ఆడవాళ్ళు బల్బులు పగలగొట్టిస్తారు.

వాళ్లకి ఆ చీకటి మురికిసందే పాయిఖానా. యే తెల్లవారుఝామున్నో, లేదూ రాత్రి చీకటి పడ్డ తర్వాతో ఆ కాలనీ ఆడవాళ్లు డబ్బాలూ, చెంబులూ తీసుకువస్తారు. ఆ సందులోకి ఆ అవసరం తీర్చుకోవడానికి.

వాళ్ళకు పాయిఖానాలు శాంక్షనై నాలుగేళ్ళయింది. కాయితాలూ,సంతకాలూ, టెండర్లూ ఫైనలైజైనై.. ముడపుల్లో తకరారు కారణాన.. ఆ కాలనీ ఆడవాళ్లకివీథి దీపాలు పగలగొట్టించే తప్పు తప్పట్లేదు.

ఆ చీకటి సందులోంచి మనుషులూ, పశువులూ విసర్జించిన దుర్గంధంలోంచి నడుస్తూ రసూల్ గరాజ్ చేరుకున్నా.

యెప్పుడో గుడ్డి రసూల్ అనబడే ఓమిలట్రీవాడు అక్కడ గరాజు నడిపేవాడు. వాడూ లేడూ, వాడునడిపే గరాజులేదు. దాని పేరు మాత్రం అవశేషంగా మిగిలింది.

అక్కడిప్పుడు బండ్లు రిపేరు కావు. నాయక్ నాటుసారా అము&మతాడు. పడిపోయిన గోడకానించి వేసిన, వారపాకలో ముగ్గురాడవాళ్లతో ఓ ముస్ది ముండలఖానా నడుపుతోంది.

నాయక్ సారా కోసం వచ్చేవాళ్ల కోసం కుంటి నూర్జహాన్ ఇంట్లో ఏసుకొచ్చిన దోసెలూ, చిట్టి వడలూ అమ్ముతూంటుంది. దాని కాలూ అవిటిది. పోలియో వచ్చి చచ్చుపడిపోయింది. దాని మొగుడు ముండాకొడుకు దౌర్జన్యానికి గుర్రై పెనమ్మీద పడీ పక్క చెంప కాలిపోయింది. వికృతత్వమంతా మూర్తీభవించినట్టుంటుంది నూర్జహాన్.

నేను గరాజ్ చేరుకున్న పధి నిముషాలకి ఆటోలో వచ్చి నాయక్ రెండు జెర్రీ కాన్లతో దిగాడు.

అవినీతి, ఈజీ మనీ వాడి గ్రామీణ నైర్మల్యాన్నీ, సంస్కృతినీ కలుషితం చేశాయి.

పైనుపంచెతో గళ్ల చొక్కాతో తలపాగాతో వచ్చేవాడు పాంటూ స్లాగుల్లోకి మారాడు. బుర్రమీసాలు కత్తిరించి వత్తించాడు. చెవిలో పోగులు మాయమయ్యాయి. నాగరికుడైపోయాడు.

'నమస్తే దొరా! జల్దొచ్చినవ. గిప్పుడె వచ్చిన ఇంగ బోనీ గాలె, గిసింత గానీ!" అన్నాడు నన్ను చూడగానే.

నాకు ఊరికే మందు పోయడానికని అన్నాడు వాడికి తెల్సు నేనుసస్పెండయిన ఎస్సైనని. వాడి దగ్గరికెళ్లి చెప్పేశా అస్సల్సంగతి!

వాడి మొహంలో భయం కాదు. విసుగు పుట్టింది.. బాంచెత్! అచ్చె పైలికి పెట్టమన్నడు గద్సారా కేసు! ఒక్క మైనాముందు గాల్నంటే యేం జేయాలె.. ధూత్తెరకీ!" అని ఊశాడు.

కాస్సేపు మౌనం వహించి ఓ క్యాన్ తీసుకెళ్ళి ముండలఖానా వారపాకలో దాచేసి వచ్చాడు. ఇంకో కాన్లోంచి ఓ ప్లాస్టిగ్లాసుడు సారా నాకు ముంచి ఇచ్చాడు. ఇద్దాగు దొరా! టేషన్లో నీ కోసారనికి బచాయిస్తరో, లేదో బాడ్‌ఖవ్వ!" అని ప్రేమగా అన్నాడు.

నే తాగేసి వెళ్లి రైటర్‌గాడికి పబ్లిక్ బూత్ నుంచి ఫోన్ కొట్టా, పది నిముషల్లో వ్యానొచ్చింది. దాని ఖర్మనో యేమో వ్యానొచ్చేఓ రెండు నిమిషాల ముందే కుంటి నూర్జహాన్ దోసెల బుట్టతో కాలీడ్చుకుంటూ వచ్చింది. "ఫో.. ఫో!" అని నాయిగ్గాడు తోలేలోపలే.. మావాళ్ల మంద దిగిపోయింది.

నాయక్, వాడి సారాక్కాను, నేనూఎక్కాము.మా రైటర్ గాడు కుంటి నూర్జహాన్ని చూసి, ఎక్కే రండా! పెషల్ వ్యాన్ గావల్న నీకు?" అని వెనుకనుంచి ఆ కుంటిదాన్ని ఒడిసి పట్టుకుని వ్యాన్లోకి ఎత్తేశాడు. వాడు ఆమెను పట్టుకున్నప్పుడు ఎక్కడ వట్టుకున్నాడో అందరూ చూస్తానే ఉన్నారు. ''అయ్యా... సారూ! దోసెలమ్ముకునేదాన్ని... కుంటిముండని నన్నిడసండ్రి సారూ! దిక్కులేని ముండన్దేసరా... నీ కాల్మొక్త!" అంటూనే ఉంది.

మా రైటర్‌గాడు వికవికా నవ్వుతూ ఆమె బుట్టలోంచి ఓ చిట్టి వడ తీసి కొరికి, 'కాలు కుంటిదైనా మస్త్ కండ ఉందే నీకు సేతులు వట్టె..!" అని అందరివైపూ చూశాడు.

పెద్ద చౌక్ దగ్గర వ్యాన్ నిలబెట్టారు. నాయక్ జేబులోంచి రైటర్ జేబులోకి కరెన్సీ కాయితాలూ మారాయి. వాడు దిగిపోయాడు.

''నో న్భోతా షారూ! కాల్మొక్త నన్నిడ్సుండ్రి!'' అని కుంటి నూర్జహాన్ కొట్టుకుంటూనేఉంది.

✦ ✦ ✦

సీసీయస్ వెనకాల గది. నాయక్ ఇచ్చిన డబ్బు బట్వాడా అయిపోయింది. కుంటి నూర్జహాన్ ఏడుస్తూనే ఉంది. సీయై వెళ్లిపోయాడు. క్యాన్లో సారా గ్లాసుల్లోకీ, తాగేవాళ్ల కడుపుల్లోకీ చేరుతుంది. లెవెన్ జీరో టూ వెంకటేశ్వర్లు ఓ పొడువాటి సీసా నిండా నింపుకున్నాడు. "మా ముసిలోని కోసరానికి..." అంటూ

సెవెన్లెవెన్ ఇబ్రహీం బెంచీ మీద కూచుని తలని రెండు చేతుల్తో పట్టుకున్నాడు. నిర్మలుడూ, స్వచ్ఛమైన వాడూ,యువకుడూ అయిన ఇబ్రహీం పై అధికారుల ముందు నిర్వీర్యుడు.

"దొరా! పచ్చి బాలింతని. పన్నెండ్డినాలై కాన్పై.... నన్నిడ్సు... దొరా! కాల్మొక్త.... పాపం, దొరా!" తల అడ్డంగా ఊపుతూ ఏడుస్తోంది.

ఇబ్రహీం అసహనంగా కదుల్తున్నాడు బెంచీమీద.

అచ్చా... జచ్చాంటే ఇడుస్తానే... పోరడా, పోర్యా కాన్పుల?"

''పోరడే దొరా! పురట్లనే సందిగొట్టి జచ్చిండు దొరా! పచ్చిగున్నా.. నన్నిడ్సు దొరా!"

అవ్.. బాలింతంటరోయ్!... ఓయ్ ఇబ్రహీం! వచ్చి దీని పాలు బితుకు సూస్తం!" అని వికవికా నవ్వాడు.

(ఈ సంఘటన అదిలాబాద్ జిల్లాలో జరిగిన వాస్తవ బీభత్సం)

ఇబ్రహీం లేచి బైటికెళ్ళిపోయాడు. మామూలే అన్నట్టు మిగిలిన వాళ్లున్నారు.

ఓ గ్లాసుమళ్లీ సారా నింపుకుని కొద్దిగా తాగి టేబిల్మీద పెట్టి కుంటి నూర్జహాన్ని సెల్లోకి ఈడ్చుకు వెళ్లాడు రైటర్.

"ఓ(.....!" అని విలపిస్తూనే ఉంది నూర్జహాన్.

బైటికెళ్లిన పిల్ల కానిస్టేబుల్ ఇబ్రహీం లోపలికొచ్చాడు. బైటికెళ్లి గోడకు అటువైపు తిరిగి సగం ఉన్న ఆ గ్లాసుని నింపేశాడు.

జిప్ పెట్టుకుంటూ వచ్చి ఆ గ్లాసు టేబుల్మీద పెట్టి, "ఆ పందికి ఇంతకంటే శిక్ష నే నెయ్యలేన్సార్!" అని కళ్లు తుడ్చుకుంటూ బైటికెళ్లిపోయాడు. ✦

*(అంకితం: పోలీస్ జీవితాన్ని ఖాకీ కరకులో కాకుండా మనిషి 'మల్లు'లో జీవించిన రిటైర్డ్ ఎస్పీ..... అన్నయ్య శ్రీ పిన్నదరి శ్యాంసుందర్‌గారికి - రచయిత)*

***(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 10 ఏప్రిల్ 2000)***